APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com

తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ శనివారం 25, జూలై 2026 సంపుటి: 01 సంచిక :58 పేజీలు : 04 వెల: 2-00/-



## విపత్తు ప్రమాదాల తగ్గింపుపై బ్రిక్స్ ప్రకటన

- భారత్ ఆతిథ్యంలో మూడో మంత్రుల సమావేశం
- సభ్య దేశాల ఏకగ్రీవ ఆమోదంతో సంయుక్త ప్రకటన
- విపత్తులను ఎదుర్కొనే సమాజాల నిర్మాణానికి సహకారం

న్యూఢిల్లీ, జూలై 24 : విపత్తు ప్రమాదాల తగ్గింపుపై బ్రిక్స్ దేశాల మూడో మంత్రుల సమావేశానికి భారత్ విజయవంతంగా ఆతిథ్యం ఇచ్చింది. ఈ సమావేశంలో సభ్య దేశాలన్నీ ఏకగ్రీవంగా విపత్తు ప్రమాదాల తగ్గింపుపై బ్రిక్స్ సంయుక్త ప్రకటనను ఆమోదించాయి. సభ్య దేశాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు విపత్తులను సమర్థంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా ఈ సమావేశం కీలక మైలురాయిగా నిలిచిందని అధికారులు తెలిపారు. సమావేశంలో 2025--2028 కాలానికి రూపొందించిన బ్రిక్స్ విపత్తు ప్రమాదాల తగ్గింపు కార్యాచరణ ప్రణాళిక అమలును వేగవంతం చేయాలని సభ్య దేశాలు పునరుద్ఘాటించాయి. ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని తగ్గించడం, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేయడం, విపత్తుల నిర్వహణలో పరస్పర సహకారాన్ని విస్తరించడం వంటి అంశాలపై ఏకాభిప్రాయం వ్యక్తమైంది. విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, సమాచార మార్పిడి, శిక్షణ కార్యక్రమాలు, సామర్థ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. విపత్తులను ఎదుర్కొనే విషయంలో సభ్య దేశాల అనుభవాలను పరస్పరం పంచుకోవడం ద్వారా మరింత సమర్థవంతమైన వ్యవస్థలను అభివృద్ధి చేయాలని అభిప్రాయపడ్డారు. వాతావరణ మార్పులు, తీవ్ర ప్రకృతి వైపరీత్యాలు, పట్టణీకరణ వంటి సవాళ్లను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరాన్ని సమావేశంలో నొక్కిచెప్పారు.

## క్వాంటం రంగానికి అమరావతి కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- క్వాంటిన్యూమ్ సీఈఓతో చంద్రబాబు సమావేశం
- ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచస్థాయి క్వాంటం పర్యావరణ వ్యవస్థ లక్ష్యం
- పరిశోధన నుంచి వాణిజ్యీకరణ వరకు సమగ్ర కార్యాచరణ

అమరావతి, జూలై 24 : అమరావతిని భారతదేశ క్వాంటం సాంకేతిక రంగానికి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ప్రఖ్యాత క్వాంటం సాంకేతిక సంస్థ క్వాంటిన్యూమ్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి డాక్టర్ రాజీబ్ హజ్రా, ఆయన బృందంతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్ ద్వారా భారతదేశ క్వాంటం సాంకేతిక లక్ష్యాలను మరింత బలోపేతం చేసే భాగస్వామ్య అవకాశాలపై ఈ సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. క్వాంటం పరిశోధన, అత్యాధునిక కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలు, క్వాంటం పరికరాల తయారీ, సరఫరా వ్యవస్థలు, నైపుణ్యాభివృద్ధి, నవ్య సంస్థల ప్రోత్సాహం, పరిశ్రమల్లో వినియోగం, వాణిజ్యీకరణ వంటి అన్ని రంగాలను కలుపుకుని ప్రపంచస్థాయి క్వాంటం పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలపడానికి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సాంకేతిక సంస్థలు ఆంధ్రప్రదేశ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకోవడం రాష్ట్రానికి ఎంతో ప్రాధాన్యమని చంద్రబాబు నాయుడు అన్నారు. అంతర్జాతీయ పెట్టుబడులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన రంగంలో సహకారంతో రాష్ట్రంలో అత్యున్నత స్థాయి ఆవిష్కరణలకు మార్గం సుగమం అవుతుందని పేర్కొన్నారు. క్వాంటం రంగంలో ప్రపంచస్థాయి సంస్థలతో కలిసి పనిచేయడం ద్వారా యువతకు కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. అమరావతిని భవిష్యత్ సాంకేతిక ఆవిష్కరణల కేంద్రంగా అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ముఖ్యమంత్రి తెలిపారు. క్వాంటం సాంకేతికతకు సంబంధించిన పరిశోధనలు, అభివృద్ధి కార్యక్రమాలు, నూతన ఆవిష్కరణలు, పరిశ్రమలకు ఉపయోగపడే పరిష్కారాల రూపకల్పన అమరావతి నుంచే జరిగేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. పరిశోధన సంస్థలు, విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య సమన్వయంతో ఈ లక్ష్యాలను సాధిస్తామని అన్నారు.





## పాఠశాల అల్పాహార పథకానికి సీఎస్ఆర్ నిధులు

- దివీస్, అరబిందో ఫార్మా నుంచి రూ.22.18 కోట్ల విరాళం
- ముఖ్యమంత్రి సమక్షంలో హరే కృష్ణ ఫౌండేషన్‌కు చెక్కుల అందజేత
- రైతులకు తోడ్పాటుతో పథకం అమలుపై ప్రభుత్వ దృష్టి

హైదరాబాద్, జూలై 24 : రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న అల్పాహార పథకానికి దివీస్ లేబొరేటరీస్, అరబిందో ఫార్మా సంస్థలు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల కింద రూ.22.18 కోట్ల విరాళాన్ని అందించాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఎంసీఆర్ మానవ వనరుల అభివృద్ధి సంస్థలోని బోధి పెవిలియన్‌లో జరిగిన కార్యక్రమంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌కు ఈ నిధులకు సంబంధించిన చెక్కులను అందజేశారు. దివీస్ లేబొరేటరీస్ సంస్థ రూ.12.18 కోట్ల చెక్కును, అరబిందో ఫార్మా సంస్థ రూ.10 కోట్ల చెక్కును హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధులకు అందజేసింది.

## విద్యార్థులతో మంత్రి ఆత్మీయ ముచ్చట్లు





- మెగా పీటీఎంలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు
- ప్రభుత్వ బడుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వ కృషి
- అదనపు తరగతి గదులు, మైదానం పనులకు హామీ

కోటబొమ్మాళి, జూలై 24 : శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం యలమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పీటీఎం--4.0 కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఆత్మీయంగా ముచ్చటించిన ఆయన విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలు, ఉన్నత ఆశయాల గురించి తెలుసుకుని వారిని ప్రోత్సహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ 1996లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన విద్యా కమిటీల స్ఫూర్తితో ప్రస్తుతం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో సమగ్ర మార్పులు తీసుకొస్తున్నట్లు తెలిపారు. విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా ఒక్కో విద్యార్థికి రూ.15 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నందున ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల విశ్వాసం పెరిగిందని మంత్రి అన్నారు. ఈ ఏడాది సుమారు 1.40 లక్షల మంది విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలను విడిచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని పేర్కొన్నారు. ఇది ప్రభుత్వ విద్యా విధానంపై ప్రజల్లో పెరిగిన నమ్మకానికి నిదర్శనమని వ్యాఖ్యా నించారు. యలమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని, త్వరలోనే అదనపు తరగతి గదుల నిర్మాణం, ఆట స్థలం అభివృద్ధి పనులను కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయని మంత్రి పేర్కొన్నారు. మెగా పీటీఎం వంటి కార్యక్రమాలు తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంచడంతో పాటు విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడుతున్నాయని తెలిపారు.



## నీట్ అంశంపై కేంద్రంతో సీజేపీ చర్చలు

న్యూఢిల్లీ, జూలై 24 : నీట్ ప్రశ్నపత్రం లీకేజీ అంశంపై సీజేపీ ప్రతినిధులతో కేంద్ర ప్రభుత్వం శుక్రవారం చర్చలు జరిపింది. ఢిల్లీలోని విఠల్ పటేల్ హౌస్‌లో జరిగిన ఈ సమావేశంలో కేంద్రం తరఫున మంత్రులు జె.పి. నడ్డా, జితేంద్ర సింగ్ పాల్గొనగా, సీజేపీ తరఫున అధికార ప్రతినిధి సౌరవ్ దాస్, జాతీయ అధికార ప్రతినిధి అశుతోష్ రాంకా హాజరయ్యారు. దాదాపు రెండు గంటల పాటు జరిగిన సమావేశంలో నీట్ అంశానికి సంబంధించిన పలు విషయాలపై చర్చించినట్లు సీజేపీ ప్రతినిధులు తెలిపారు. సమావేశంలో మూడు ప్రధాన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం ముందు ఉంచినట్లు సీజేపీ ప్రతినిధులు మీడియాకు వెల్లడించారు. ఇటీవల జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న వారిపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోకూడదని, నీట్ ప్రశ్నపత్రం లీకేజీ కారణంగా ఆత్మహత్య చేసుకున్న వారి కుటుంబాలకు పరిహారం అందించాలని కోరినట్లు తెలిపారు. ఈ రెండు డిమాండ్లకు కేంద్రం సానుకూలంగా స్పందించిందని వారు పేర్కొన్నారు. మరో ప్రధాన డిమాండ్ అయిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అంశంపై కేంద్రం ఒక రోజు సమయం కోరినట్లు సీజేపీ ప్రతినిధులు తెలిపారు. ఈ అంశంపై శనివారం చర్చించి నిర్ణయం తెలియజేస్తామని కేంద్ర ప్రతినిధులు చెప్పినట్లు వారు పేర్కొన్నారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉందని తెలిపారు. నీట్ పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంపు, ప్రశ్నపత్రాల లీకేజీని అరికట్టేందుకు ఐదు సూచనలను కూడా కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు సీజేపీ ప్రతినిధులు వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో లోపాలు పునరావృతం కాకుండా సమర్థమైన చర్యలు తీసుకోవాలని వారు కోరినట్లు తెలిపారు. శనివారం మరో విడత చర్చలు నిర్వహించనున్నట్లు కేంద్ర మంత్రి జె.పి. నడ్డా వెల్లడించినట్లు సీజేపీ ప్రతినిధులు తెలిపారు. తమ అన్ని డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళన కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అంశంపై కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై అధికారికంగా ఎలాంటి నిర్ణయాన్ని ఇప్పటివరకు ప్రకటించలేదు. శనివారం జరగనున్న చర్చలు, అనంతరం వెలువడే అధికారిక ప్రకటనతో తదుపరి పరిణామాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# ఎంపీఈవోల రాష్ట్రస్థాయి సహాయ నిరాకరణ ఉద్యమానికి ఏపీ ఎన్జీవో జిల్లా సంఘం సంపూర్ణ మద్దతు





**• ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**

పుట్టపర్తి, జూలై 24 అనంత సూర్య: రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఎంపీఈవోల రాష్ట్రస్థాయి సహాయ నిరాకరణ ఉద్యమానికి ఏపీ ఎన్జీవో జిల్లా సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఉద్యమం నాలుగో రోజు శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంలో నిర్వహించిన నిరసన శిబిరాన్ని ఏపీ ఎన్జీవో జిల్లా సంఘం, వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సంఘం, పలు ప్రజాసంఘాల నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షులు లింగ రామ్మోహన్ మాట్లాడుతూ, గ్రామస్థాయిలో రైతులకు, ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఎంపీఈవోలు కీలక సేవలు అందిస్తున్నారని తెలిపారు. 12 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ వారికి ఉద్యోగ భద్రత, కనీస వేతన భద్రత కల్పించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. వ్యవసాయ విస్తరణ అధికారుల జిల్లా సంఘం అధ్యక్షులు ఆనంద్ నాయక్ మాట్లాడుతూ, వ్యవసాయ శాఖలో అమలు చేసే ప్రతి కార్యక్రమం విజయవంతం కావడంలో ఎంపీఈవోల పాత్ర ఎంతో కీలకమని, వారికి తక్షణమే న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సంఘం, ఏపీ మహాశివ సంఘం, పలు ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ, ఎంపీఈవోల సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఉద్యోగ భద్రతతో పాటు సమాన పనికి సమాన వేతనం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షులు లింగ రామ్మోహన్, ఏపీ మహాశివ రాష్ట్ర అధ్యక్షులు కళాధర్, సత్యసాయి తాలూకా అధ్యక్షులు దేవేంద్ర, సహాయ అధ్యక్షులు మురళి, వ్యవస్థాపక కార్యదర్శి విజయ్ కుమార్, జిల్లా మినిస్టీరియల్ సిబ్బంది సంఘం అధ్యక్షులు ఫక్రుద్దీన్, వ్యవసాయ విస్తరణ అధికారుల జిల్లా సంఘం అధ్యక్షులు ఆనంద్ నాయక్, పదవీ విరమణ పొందిన సూపరింటెండెంట్ గఫూర్‌తో పాటు ఎంపీఈవో నాయకులు రవికుమార్, జాఫర్ వలి, రాజేష్ బాబు, గంగారాజు, భవ్య, అనిత, లావణ్య, మీనా తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటక మద్యం కేసులో నిందితుడికి 7 నెలల జైలు శిక్ష, రూ. 4,200 జరిమానా




కొత్తచెరువు, జులై 24, అనంత సూర్య: కర్ణాటక మద్యం అక్రమంగా కలిగి ఉన్న కేసులో నిందితుడికి 7 నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ. 4,200 జరిమానా విధిస్తూ పుట్టపర్తి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శుక్రవారం తీర్పు వెలువరించారు. పోలీసుల సమాచారం మేరకు.. 05.11.2021న కొత్తచెరువు మండలం తలమర్ల ప్రభుత్వ పాఠశాల సమీపంలో తలమర్ల గ్రామానికి చెందిన రామాంజినేయులు అలియాస్ రామాంజి వద్ద 24 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు ఉన్నట్లు నాటి కొత్తచెరువు ఎస్సై కె ఎం లింగన్న, హెడ్ కానిస్టేబుల్ నాగూర్ మరియు సిబ్బంది గుర్తించి పట్టుకున్నారు. మద్యం అమ్ముతున్నట్లు నిర్ధారణ కావడంతో అతనిపై కొత్తచెరువు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుపై పుట్టపర్తి జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో సమగ్ర విచారణ జరిగింది. సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం నిందితుడు రామాంజినేయులుపై నేరం రుజువు కావడంతో అతనికి 7 నెలల జైలు శిక్ష, రూ. 4,200 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. కేసులో సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరిచి, నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా వ్యవహరించిన అధికారులను శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీశ్ కుమార్, ప్రత్యేకంగా అభినందించారు.

# నీట్ పేపర్ లీకేజీకి నిరసనగా పుట్టపర్తిలో విద్యార్థి సంఘాల ఆందోళన






**• దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చి వినూత్న నిరసన**

**• కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి: ఏఐఎస్ఓ, యు ఎస్ ఎఫ్ ఐ**

పుట్టపర్తి/కొత్తచెరువు, జులై 24, అనంత సూర్య: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు ఏఐఎస్ఓ, యు ఎస్ ఎఫ్ ఐ పిలుపునిచ్చిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ పుట్టపర్తిలో శనివారం ఉధృతంగా సాగింది. ఈ సందర్భంగా పుట్టపర్తి లోని గణేష్ సర్కిల్ వద్ద ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నాయకులు మెడకు ఉరితాళ్లు వేసుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ నిమ్మకు నీరెత్తిన వైఖరిని నిరసిస్తూ దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్, యు ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కుమార్ మాట్లాడుతూ... శాంతియుతంగా బంద్ నిర్వహిస్తున్న విద్యార్థి నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పోలీసుల కాపలా మధ్య ప్రభుత్వ విద్యాసంస్థలు: ప్రైవేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్‌కు మద్దతు తెలిపితే, ప్రభుత్వ విద్యాసంస్థలు మాత్రం పోలీసులను కాపలా పెట్టుకుని బంద్‌ను అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. 2014 నుండి దేశవ్యాప్తంగా సుమారు 152 పరీక్షా పేపర్లు లీక్ అయ్యాయని, పేపర్ లీకేజీల వల్ల దేశవ్యాప్తంగా 22 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చలనం లేకపోవడం దారుణమన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పక్షాన నిలబడాల్సింది పోయి కేంద్రానికి తొత్తుగా మారిందని విమర్శించారు. ఏపీలో బీజేపీ అంటే "బాబు-జగన్-పవన్" అని అర్థ మవు తోందని, అందుకే ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు, అరెస్టు చేసిన విద్యార్థి నాయకులను తక్షణమే విడుదల చేసే వరకు తమ ఉద్యమాన్ని ఆపేది లేదని నాయకులు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో యు ఎస్ ఎఫ్ ఐ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ కార్తీక్, ఏఐఎస్ఓ నాయకులు అక్షయ్, దినేష్, పవన్ తేజ, యశ్వంత్, సాయి చరణ్, వెంకట్రామిరెడ్డి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## నార్పల అబ్బాయి స్పోర్ట్స్ అకాడమిక్ కు ఎంపిక



అనంతపురం, జూలై 24 అనంత సూర్య : నార్పల గ్రామానికి చెందిన కవి రచయిత జాతీయ త్రైక్వాండో ప్లేయర్ ప్రైవేట్ ఉపాధ్యాయుడు వల్లేపు వేంకట సాయినాథ్ కుమారుడు వల్లేపు మణికుమార్ స్పోర్ట్స్ అకాడమీ (వైఎస్ఆర్ కడప జిల్లా) కి సెలెక్ట్ కావడం నార్పల మండలానికి గర్వ కారణం.. నార్పల మండల కేంద్రంలోని సరస్వతి విద్యామందిరంలో తొమ్మిదో తరగతి చదువుతూ.. హాకీ క్రీడపై మక్కువతో గత మూడు సంవత్సరాలుగా మాజీ మిలిటరీ వెంకట్రామి రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఎన్నో టోర్నమెంట్లులో పాల్గొని అద్వితీయమైన ప్రతిభను కనబరుస్తూ అండర్ -14 కెప్టన్ గా కూడా గత సంవత్సరం చిత్తూరు జిల్లా చంద్రగిరిలో జరిగిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో అనంతపురం జిల్లాను తృతీయ స్థానంలో నిలబెట్టాడు. చదువులోనూ చక్కని ప్రతిభను కనబరుస్తూ.. గత నెలలో వైఎస్సార్ కడప జిల్లాలో జరిగిన స్పోర్ట్స్ అకాడమిక్ సెలెక్షన్ లో సైతం అన్ని ఈవెంట్స్ లోనూ ప్రథమ స్థానంలో నిలిచి.. స్పోర్ట్స్ అకాడమీ కి సెలెక్ట్ అయ్యాడని, తల్లితండ్రులు సంతోషిస్తూ.. తండ్రికి తగ్గ తనయుడిగా క్రీడల్లో రాష్ట్రానికి దేశానికి ప్రాతినిధ్యం వహించాలని కోరుతూ మణికుమార్ ను మండల ప్రజలు, బంధువులు అభినందించారని వెంకట సాయినాథ్ తెలిపారు.

# మంత్రి లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలలకు కొత్త ఊపు: ఎమ్మెల్యే పరిటాల సునీత






అనంతపురం, జూలై 24 అనంత సూర్య : ఏ ప్రభుత్వ పాఠశాలలో చూసినా మెరుగైన సౌకర్యాలు, మంచి మార్కులతో రాణిస్తున్న విద్యార్థులు కనిపిస్తున్నారని.. ఇది విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మార్క్ అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఆత్మకూరులోని జడ్పీ హైస్కూల్లో జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఆత్మకూరులో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి ఆమె ర్యాలీగా పాఠశాల ప్రాంగణానికి చేరుకున్నారు. పాఠశాలలో విద్యార్థులు స్వాగతం సుస్వాగతం గీతాలాపనతో స్వాగతం పలికారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులతో సెల్ఫీ ఫ్రేమ్ లో సెల్ఫీలు తీసుకున్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ మీ పిల్లలు ఎలా చదువుతున్నారో తెలుసుకున్నారా.. పాఠశాలలో సౌకర్యాలు ఎలా ఉన్నాయి, ఉపాధ్యాయులు ఎలా పని చేస్తున్నారు, భోజనం బాగుందా, తల్లికి వందనం పథకం అందిందా వంటి అంశాల గురించి తెలుసుకున్నారు. తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన కనిపించింది. ఆ తర్వాత విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి ఆటల పోటీల్లో పాల్గొన్నారు. అందంగా ముగ్గులు వేసిన మహిళలను అభినందించారు. ఆ తర్వాత విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల అభివృద్ధి కోసం ఎన్.ఆర్.ఐ పాటిబండ్ల ప్రభాకర్ 1లక్ష రూపాయలు పాఠశాలకు విరాళం అందించారు. పి.సిద్దారాంపురం గ్రామానికి చెందిన గుంటూరు రామాంజనేయులు ఆత్మకూరు స్కూల్ లో 1977 - 1978సం లో చదివగా.. గత డిసెంబర్ లో గుండెపోటుతో మరణించారు. అయన కుమారులు గుంటూరు మంజునాథ్, పవన్ కళ్యాణ్ లు 50వేల రూపాయలు ఎమ్మెల్యే పరిటాల సునీత చేతుల మీదుగా విరాళం అందించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత కూడా తన మరిది రామాంజనేయులు పేరుపై 50వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ 1950సంవత్సరంలో ఇక్కడ ఒక పూరి గుడిసెలో పాఠశాల ప్రారంభమైందన్నారు. ఇసుకలో అక్షరాలు రాసి చదువు నేర్చుకున్నారన్నారు. అక్కడి నుంచి ముగ్గురు దాతలు ముందుకొచ్చి 4.50 ఎకరాల స్థలాన్ని అందించగా.. గ్రామస్థుల శ్రమ దానంతో పాఠశాల ఏర్పడిందన్నారు. ఇక్కడ చదువుకున్న ఎంతోమంది డాక్టర్లు, ఇంజనీర్లు వివిధ స్థాయిలలో ఉన్నారని గుర్తు చేశారు. అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు బాగా చదుకోవాలని చూశారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ వచ్చిన తర్వాత ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. గతంలో జగన్ రెడ్డి పుస్తకాలు, పిల్లలకు ఇచ్చే వాటిపై కూడా తన ఫోటోలు వేసుకున్నారన్నారు. పాఠశాలల్లో రాజకీయాలు ఉండకూడదని.. మంత్రి నారా లోకేష్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఫోటోలతో విద్యా కానుక కిట్లు అందజేశారన్నారు. గతంలో ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో మొదటి ఏడాది కన్నా ఎక్కువగా 67లక్షల 47వేల 190మంది విద్యార్థులకు 10వేల 121 కోట్లు తల్లికి వందనం అందజేశారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలోనే 39వేల749 మందికి రూ.51.67కోట్లు తల్లికి వందనం ద్వారా అందించారన్నారు. ఆత్మకూరులో మల్లికార్జున అనే వ్యక్తి ఇంట్లోనే ముగ్గురు పిల్లలకు 39వేలు అందగా.. పి.కొత్తపల్లి ముత్యాలప్ప ఇంట్లో ఐదు మంది పిల్లలు ఉండగా 65వేలు అందించారన్నారు. మెగా పేరెంట్స్ మీటింగ్ ద్వారా తమ పిల్లలు ఏ విధంగా చదువుతున్నారని తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం అందించే అనేక సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని.. క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఎమ్మెల్యే సునీత సూచించారు.

## శ్రీ సత్యసాయి 5కే రన్ & రైడ్‌కు పోలీసు శాఖ సంపూర్ణ సహకారం




**• జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌ను ఆహ్వానించిన శ్రీ సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు**

పుట్టపర్తి, జూలై 24 అనంత సూర్య:భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా జూలై 26న పుట్టపర్తిలో నిర్వహించనున్న "శ్రీ సత్యసాయి 5కే రన్ & రైడ్ -- ఎ స్పిరిట్ ఆఫ్ యూనిటీ (ఫిట్ ఇండియా)" కార్యక్రమానికి శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. లక్ష్మణరావు నాయకత్వంలోని ప్రతినిధి బృందం శుక్రవారం శ్రీ సత్యసాయి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సతీష్ కుమార్, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కార్యక్రమానికి ఆహ్వానించింది. ఈ సందర్భంగా రాష్ట్ర సంయుక్త సేవా సమన్వయకర్త విశ్వనాథ రెడ్డి, జిల్లా సేవాదళ్ సమన్వయకర్త సీతారాము, సభ్యుడు సుబ్రహ్మణ్య స్వామి తదితరులు ఎస్పీకి ఈవెంట్ టీ-షర్టును అందజేశారు. సమావేశంలో రన్ & రైడ్ మార్గపటం, కార్యక్రమ నిర్వహణ, పాల్గొననున్న వారి సంఖ్య, హిల్ వ్యూ స్టేడియంలో చేపట్టిన ఏర్పాట్లపై ఎస్పీ వివరాలు తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ, భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం సమాజంలో ఐక్యత, ఆరోగ్య చైతన్యం, సేవాభావాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఇటువంటి ఆదర్శప్రాయ కార్యక్రమాలకు జిల్లా పోలీసు శాఖ తరఫున సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. లక్ష్మణరావు మాట్లాడుతూ, జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీసు శాఖ అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. అధికారుల సహకారంతో ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

## రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేటీకరించడం లేదు- జిల్లా రిజిస్ట్రార్ జి. కృష్ణకుమారి



పుట్టపర్తి, జూలై 24 అనంత సూర్య:రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ఎం.ఎస్. నెం.396 ద్వారా రిజిస్ట్రేషన్ శాఖ లేదా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరించడం లేదని శ్రీ సత్యసాయి జిల్లా రిజిస్ట్రార్ జి. కృష్ణకుమారి స్పష్టం చేశారు.శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, ప్రజలకు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా వేగవంతమైన, పారదర్శక సేవలు అందించేందుకే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించిన చట్టబద్ధ అధికారాలు, పత్రాల పరిశీలన, నమోదు, రికార్డుల నిర్వహణ పూర్తిగా సబ్ రిజిస్ట్రార్ల ఆధీనంలోనే కొనసాగుతాయని పేర్కొన్నారు.ప్రజల ఆస్తుల వివరాలు లేదా ప్రభుత్వ డేటాను ఏ ప్రైవేట్ సంస్థకూ బదిలీ చేయడం లేదని, డేటా భద్రతపై వస్తున్న ప్రచారం పూర్తిగా నిరాధారమని స్పష్టం చేశారు.డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్ కొనసాగుతున్నప్పటికీ ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.ప్రజలు అపోహలు నమ్మకుండా సేవలకు సంబంధించిన వివరాల కోసం జిల్లా పరిధిలోని బుక్కపట్నం, చిలమత్తూరు, సి.కె.పల్లి, ధర్మవరం, కదిరి, హిందూపురం, పెనుకొండ, మడకశిర, తనకల్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నేరుగా సంప్రదించాలని జిల్లా రిజిస్ట్రార్ సూచించారు.

## మెగా పీటీఎంలో పాల్గొన్న మంత్రి పయ్యావుల కేశవ్



వజ్రకరూరు, జూలై 24 అనంత సూర్య: అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరు కె.వి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్--టీచర్ మీట్ (మెగా పీటీఎం--4.0) కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి విద్యార్థుల విద్యా ప్రగతి, పాఠశాలలో అమలవుతున్న బోధన విధానాలు, విద్యార్థుల ప్రతిభాభివృద్ధిపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో చర్చించారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయం కీలకమని పేర్కొన్నారు.కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు



## ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకెళ్లాలిప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం: కలెక్టర్ ఓ. ఆనంద్



అనంతపురం, జూలై 24 అనంత సూర్య: ప్రతి విద్యార్థి ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధన కోసం కృషి చేస్తే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అన్నారు.గార్లదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్--టీచర్ మీట్ (మెగా పీటీఎం--4.0) కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతోందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని సూచించారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, పిల్లలు ఇంట్లో కూడా క్రమం తప్పకుండా చదివేలా ప్రోత్సహించాలని కోరారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, షూస్, బ్యాగులు, విద్యార్థి మిత్ర కిట్లు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, అలాగే 'తల్లికి వందనం' పథకం ద్వారా ఆర్థిక ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు.జిల్లాలో ఈ ఏడాది సుమారు 4 వేల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం ప్రభుత్వ విద్యపై పెరిగిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి ఒలింపిక్స్‌లో 400 మీటర్లలో స్వర్ణం, 100 మీటర్లలో రజత పతకం సాధించిన దివ్యాంగ విద్యార్థి పి. రాహుల్‌ను కలెక్టర్ మెమెంటో, ప్రశంసాపత్రంతో సత్కరించారు. అలాగే విద్యార్థులు ప్రస్తావించిన హిందీ ఉపాధ్యాయుల కొరత, ప్రహరీ గోడ, ఆటస్థలం, తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ కేశవరెడ్డి, ఎంఈఓ తారచంద్ర నాయక్, ప్రధానోపాధ్యాయులు సుంకన్న, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈనెల 27 నుంచి అంతా ప్రజా క్షేత్రంలో ఉండాలి



అనంతపురం, జూలై 24 అనంత సూర్య :రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. శుక్రవారం అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్లు, క్లస్టర్ ఇన్ ఛార్జిలు, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఉన్న ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ పరంగా చేపట్టవలసిన అంశాలపై చర్చించి, అవసరమైన తీర్మానాలు చేసి మై టీడీపీ యాప్ లో అప్లోడ్ చేశారు. సోమరవాండ్లపల్లి రిజర్వాయర్ పనులు, అలాగే పేరూరు పరిటాల రవీంద్ర సాగునీటి పథకం కాలువకు భూములిచ్చిన రైతులకు పరిహారం, రాప్తాడు సమీపంలో రేమాండ్స్ పరిశ్రమ, నడిమివంకకు రక్షణ గోడ నిర్మాణం, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణాలు, హౌసింగ్ నిర్మాణంలో రాక్రీట్ సంస్థ అక్రమాలపై విచారణ వేగవంతం చేయడం, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాలలో సోలార్, పవన విద్యుత్ పరిశ్రమలు నెలకొల్పే అంశం, దాదులూరు సమీపంలోని వెయ్యి



ఎకరాల ప్రభుత్వ భూముల్లో పరిశ్రమలు నెలకొల్పడం, రామగిరి బంగారు గనులను తెరిపించడం వంటివి ప్రధానంగా ఉన్నాయన్నారు. వీటితో గ్రామాల్లో చేపట్టాల్సిన అంశాల గురించి తీర్మాణాలు చేసి రాష్ట్ర పార్టీకి పంపినట్టు వివరించారు. అలాగే ఈనెల 27వ తేదీ నుంచి నిర్వహించే రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం ఇంటింటి ప్రచార కార్యక్రమం గురించి ప్రదానంగా చర్చించారు. బూత్ లెవర్ ఏజెంట్లు, కార్యకర్తల దగ్గర నుంచి నా వరకు ప్రతి ఒక్కరూ 27వ తేది ఇంటింటా ప్రచారం నిర్వహించాలన్నారు. ఉదయం 7:30గంటల నుంచి రాత్రి 9. 00గంటల వరకు రోజుకు 30కుటుంబాలను కలుసుకుని రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని సూచించారు. ఇంటి సభ్యులకు కరపత్రాన్ని అందిస్తూ ఫోటో తీసి యాప్ లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొనాలని ఎమ్మెల్యే సునీత ఆదేశించారు.

**ప్రజా సమస్యల్ని సీరియస్ గా తీసుకోండి.. ఎమ్మెల్యే సునీత**

ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంలో అధికారులు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో ఆమె ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారితో ఓపిగ్గా మాట్లాడుతూ సమస్యలు తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను తక్షణమే పరిష్కారించాలని ఆమె అధికారులకు సూచించారు. మరికొన్నింటిని నిర్ణీత గడువులోగా పరిష్కారమయ్యేలా చొరవ చూపాలన్నారు. అర్జీల్లో ప్రధానంగా రెవెన్యూ, హౌసింగ్, పింఛన్లు, విద్యుత్ తో పాటు పలు అంశాలు ఉన్నాయి. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని.. ఎక్కడైనా వాటి పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు కూడా తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే సునీత వివరించారు.

# పోక్సో కేసులో నిందితుడికి 25 ఏళ్ల జైలు శిక్ష



**బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశం**

పుట్టపర్తి, జూలై 24 అనంత సూర్య: మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన పోక్సో కేసులో నిందితుడికి 25 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ అనంతపురం ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి చిన్నబాబు శుక్రవారం తీర్పు వెలువరించారు. అలాగే బాధితురాలికి రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు .పోలీసుల వివరాల ప్రకారం, కదిరి టౌన్ పోలీస్ స్టేషన్‌లో 2021లో నమోదైన ఈ కేసులో దర్యాప్తు పూర్తి చేసి న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా 11 మంది సాక్షులను పరిశీలించిన కోర్టు నేరం రుజువైందని నిర్ధారించి ఈ తీర్పు ఇచ్చింది.ప్రాసిక్యూషన్ తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. మురళీకృష్ణ వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తు అధికారులు, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు మానిటరింగ్ విభాగం పోలీసు సిబ్బంది సమన్వయంతో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసినందుకు జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ అభినందించారు.మైనర్ బాలికలపై నేరాలకు పాల్పడే వారిపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని, ఇటువంటి నేరాలకు పాల్పడిన వారికి శిక్ష తప్పదని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

# నీట్ పేపర్ లీకేజ్ కు కారణమైన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి





- నీట్ పరీక్ష ఆన్లైన్లో నిర్వహించాలి
- నీట్ పరీక్ష నిర్వహణలో రాష్ట్రాల హక్కులు కల్పించాలి
- విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త బందులో భాగంగా అనంతపురం జిల్లా వ్యాప్తంగా జరిగిన బంద్ లో పాల్గొన్న విద్యార్థి, యువజన, మహిళ సంఘాలు
- నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకిస్తూ జరిగే బంద్ ను స్వచ్ఛందంగా ప్రైవేట్ విద్యాసంస్థలు బందు ప్రకటిస్తే.. ప్రభుత్వ విద్యాసంస్థలు మాత్రం పోలీసులను కాపలా పెట్టుకుని బంద్ ను అడ్డుకోవడం దుర్మార్గం
- ఐక్య విద్యార్థినేతలు

అనంతపురం, జూలై 24 అనంత సూర్య : నీట్ పేపర్ లీకేజ్ కు కారణమైన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నిర్వహించిన దేశవ్యాప్త బందులో భాగంగా అనంతపురం జిల్లా వ్యాప్తంగా బంద్ నిర్వహించినట్లు ఐక విద్యార్థి నాయకులు తెలిపారు. ఈ బందుకు ప్రైవేట్ విద్యా సంస్థలు మద్దతు తెలపగా ప్రభుత్వ పాఠశాలలు మాత్రం పోలీసులను కాపలాగా ఏర్పాటుగా చేసుకొని నిర్వహించడం పట్ల విద్యార్థి నేతలు ఖండిస్తూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి పరమేష్ , ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు హనుమంతరాయుడు, ఏఐఎస్బి జిల్లా కార్యదర్శి పృథ్వి, పి డి ఎస్ యు జిల్లా కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్, పి ఎస్ ఎఫ్ రాష్ట్ర నాయకులు అబ్దుల్ అలం, ప్రతిభా భారతి ఎన్ఎస్ యుఐ జిల్లా కార్యదర్శి ఓబులేసు, ఏఐఎస్బి జిల్లా కార్యదర్శి నరసింహ, ఏఐఎస్ఎ జిల్లా కార్యదర్శి బాలకృష్ణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్, ఏఐవైఎఫ్ నాయకులు దుర్గ ప్రసాద్, మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీకేజ్ పై శాంతియుతంగా బంద్ నిర్వహించిన ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్యుఐ, ఏఐఎస్బి, పిఎస్ఎఫ్, పిడిఎస్యు, ఐసా, ఏఐవైఎఫ్, డివైఎఫ్ఐ ఐద్వా నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజ్ కు బాధ్యత వహిస్తూ.. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ.. శుక్రవారం వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు చేపట్టిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ లో భాగంగా రాయదుర్గం నియోజకవర్గంలో శాంతియుతంగా బందు నిర్వహిస్తున్న నాయకులను అనంతపురం టూటౌన్ పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. సప్తగిరి సర్కిల్ లో కెఎస్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బంద్ నిర్వహించడానికి వెళ్లిన విద్యార్థి, యువజన సంఘాల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బంద్ నిర్వహిస్తే, నిరసన తెలిపే హక్కును కాలరాస్తున్నారు. నీట్ లీకేజ్ వల్ల దేశవ్యాప్తంగా 22 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటే, ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బంద్ కు మద్దతు తెలిపిన ప్రైవేట్ విద్యాసంస్థలు..పోలీసులను కాపలా పెట్టుకుని బంద్ ను అడ్డుకున్న ప్రభుత్వ విద్యా సంస్థలు 2014 నుండి దేశవ్యాప్తంగా 152 పరీక్షా పేపర్లు లీక్ అయ్యాయని, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఈ అంశంపై స్పందించలేదు. బీజేపీ అంటే భారతీయ జనతా పార్టీ కాదు, ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు, జగన్, పవన్ అని ఇప్పుడు అర్థమవుతోంది. విద్యార్థుల పక్షాన నిలబడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తొత్తుగా మారి అక్రమ అరెస్టులు చేయిస్తోందని నాయకులు విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు, అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేసే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు తరిమేల గిరి, మంజునాథ్, శివ, విజయ్, గణేష్, సాయి, మహేష్, బండారు శంకర్, విక్టర్, సాయి, ధనుష్, అజయ్, రాజేష్, వంశీ, బీమా, మోహన్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## సమిష్టి కృషితో మెరుగైన విద్యా ఫలితాలు



**అనంతపురం, జూలై 24 అనంత సూర్య :** ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మరింత మెరుగైన ఫలితాల సాధన కోసమే మెగా పేరెంట్ టీచర్ మీట్ 4.0 కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్లు ప్రముఖ విద్యావేత్త, రాయలసీమ ప్రజాసమాఖ్య అధ్యక్షులు, కక్కలపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొర్తి వెంకటస్వామి అన్నారు. శుక్రవారం కక్కలపల్లిలో జరిగిన సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నిర్వహించడం అభినందనీయమన్నారు. పాఠశాల విద్యా శాఖ తన రాష్ట్రవ్యాప్త పేరెంట్–టీచర్ ఎంగేజ్‌మెంట్ ప్రోగ్రామ్ యొక్క నాలుగో ఎడిషన్, మెగా పేటీఎం 4.0 కార్యక్రమం మెరుగైన సంసిద్ధత, భాగస్వామ్యాన్ని పెంచడానికి ఎంతగానో దోహదపడుతుందని గొర్తి వెంకట్ అన్నారు. ఈ కార్యక్రమం అందరినీ కలుపుకొని, ప్రభావవంతంగా, విద్యా హక్కు చట్టం, 2009, జాతీయ విద్యా విధానం, 2020కి అనుగుణంగా ఉండేలా రూపొందించారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణయ్య, మాజీ సర్పంచ్ శంకర్, బయప్ప, పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షురాలు అనిలా, ఎంపీటీసీ ఓబులేసు, డీలర్ శివానంద, గ్రామ పెద్ద నరసింహులు, స్వర్ణ సచివాలయ సిబ్బంది మహేష్, తనూజ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, పూర్వ విద్యార్థులు దిలీప్ కుమార్, సుధాకర్, దాతలు బయప్ప, నారాయణస్వామి, టీచర్స్ అలివేలమ్మ, నాగరత్నమ్మ, సుశీల, లలిత, తల్లులు మారక్క, తిమ్మమ్మ, రేష్మ, లక్ష్మీదేవి, ఆదిలక్ష్మి, నారాయణమ్మ, అలాగే, గౌరీ, జయమ్మ, లోకేశ్వరి, మహేష్, తల్లిదండ్రులు, విద్యార్థులు స్థానికులు పాల్గొన్నారు.

## నీట్‌పై చంద్రబాబు, పవన్, జగన్ స్పందించాలి




**అనంతపురం, జూలై 24 అనంత సూర్య :** భారతదేశవ్యాప్తంగా నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్ టెస్ట్) ప్రశ్న పత్రం లీకేజీ వ్యవహారంపై సీఎం చంద్రబాబు, పవన్, వైఎస్ జగన్ రెడ్డి వంటి ముఖ్య నేతలు స్పందించాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జేఏసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్ అన్నారు. దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ కారణంగా అనంతపురం నగరంలో విద్యార్థి జేఏసీ నేతల అన్ని ప్రైవేట్, కార్పొరేట్, ప్రభుత్వ విద్యా సంస్థలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా జేఎన్టీయూ యూనివర్సిటీలో విలేకరుల సమావేశం అమర్ యాదవ్ మాట్లాడుతూ.. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థి, యువతపై ఢిల్లీ పోలీసులు అనవసరంగా లాఠీఛార్జ్ చేయడం దారుణమన్నారు. నీట్ పేపర్ లీకేజ్ వలన కొన్నేళ్ల నుంచి కష్టపడి చదివిన చదువు వృధా అయిందన్నారు. ఆవేశంతో లక్షలాది మంది విద్యార్థులు యువతీ యువకులు దేశ రాజధాని ఢిల్లీ వస్తే, బీజేపీ ప్రభుత్వం ఉద్యమాన్ని అణచివేసే దిశగా విద్యార్థులపై లేనిపోని ఆరోపణలు చేసి, విద్యార్థులపై విద్యార్థి సంఘాలపై పలు రాజకీయ సంస్థలపై దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. గోటితో పోయేదాన్ని గొడలి వరకు తెచ్చుకున్నారని, ఒక మంత్రి రాజీనామాతో సర్దుమనిగే వివేదాన్ని అనవసరంగా ఇంత దూరంగా ఉద్యమాన్ని తీసుకెళ్లారని తెలిపారు. తమిళనాడు రాష్ట్ర తరహాలో ఆంధ్రప్రదేశ్ లో కూడా నీట్‌ను రద్దు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. బంద్‌లో వివిధ విద్యార్థి సంఘాల నేతలు ప్రశాంత్, బీసీ రాజేష్, పోలార్డ్ నరేష్,శివుడు, ప్రవీణ్, విజయ్, గోవర్ధన్, గోవింద్, యశ్వంత్, రేవంత్, మురళి తదితరులు పాల్గొన్నారు.




# నిబంధనలా.. 'నో' సార్!

- అక్రమ వసూళ్లా.. మేడం సార్.. మేడం !
- రకరకాల పేరుతో అక్రమ వసూళ్ల దొబ్బుడు
- జిల్లా విద్యాశాఖ కళ్ళకు గంతలు
- ఆ విద్యా సంస్థ వ్యవస్థాపకుడినే మోసం చేస్తున్న సిబ్బంది
- ఆందోళనకు సిద్ధమవుతున్న విద్యార్థి సంఘాలు
- జాగో తల్లిదండ్రులు అంటున్న మేధావి వర్గం





*అనంతపురం, జూలై 24 అనంత సూర్య :*

దోపిడీ దోపిడీ దోపిడీ ఎక్కడ చూసినా అక్రమ వసూళ్లే. ఒకరిని చూసి మరొకరు రకరకాల పేరుతో విద్యను వ్యాపారంగా మార్చేసి అక్రమ సంపాదన లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు స్పష్టంగా కనబడుతుంది. ప్రభుత్వ విద్యా హక్కు చట్ట నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తున్నా.. తమకేమీ పట్టనట్లుగా జిల్లా విద్యాశాఖ కళ్ళకు గంతలు కట్టుకోవడంపై బహిరంగ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. **'అనంత సూర్య బృందం'** పరిశీలనలో మరో పాఠశాల ఇలా వెలుగులోకి వచ్చింది. తోడే కొద్దీ రకరకాల ఫీజుల పేరుతో నాణ్యమైన విద్యను అందిస్తామని చెప్పే ముసుగులో ఎస్సార్ నిబంధనల **'నో'** సార్. మా అక్రమ వసూళ్లా, మేడం సార్.. మేడం అంతా చూసుకుంటుంది అంటూనే, ఆ పాఠశాలకు ఉన్న అరకొర ఆ మంచి పేరును సైతం యాజమాన్యానికి తెలియకుండా **'క్యాష్'** చేసుకుంటుందంటే మీరు నమ్ముతారా. అవునట అదే అక్షర సత్యమట. ఆ విద్యా సంస్థకు సంబంధించిన కళాశాలలు, పాఠశాలలకు సంబంధించి ఎవరైనా స్వచ్ఛందంగా ప్రవేశాలు చేసుకున్న ఆ ప్రవేశాలను కూడా తానే చేర్పించానన్నట్లుగా ఓ మేడం ఆమె ఖాతాలోకి వేసుకొని ఒక్కో అడ్మిషన్ నుండి రూ.10 వేల వరకు.. అది కూడా విద్యాసంస్థ వ్యవస్థాపకునికే మస్కా కొట్టేలా నొక్కేస్తుందని తెలిసింది.

**రకరకాల పేరుతో అక్రమ వసూళ్ల దొబ్బుడు :**

ఈ ఎస్సార్ పాఠశాల, కళాశాల స్థానిక నిర్వాహకులు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి రకరకాల పేరుతో వసూలు చేస్తున్న ఆ ఫీజుల గురించి తెలుసుకుంటే మిగిలిన విద్యాసంస్థలు సైతం నోళ్లు వెళ్లబెట్టాల్సిందే. అలా ఉంటుంది మరి వారి వసూళ్ల పర్వం. ఆ వివరాలను ఒకసారి పరిశీలిస్తే.. అడ్మిషన్ ఫీజు నుండి మొదలు వేడి నీళ్ళకు ఒక ఫీజు, పాకెట్ మనీ, డిపాజిట్ పేరుతో ఒక రకమైన ఫీజు, ఈవెంట్ పేరుతో మరో రకమైన ఫీజు, పరీక్షా సెంటర్‌కు బస్సులో తీసుకెళ్లేందుకు ఫీజు, దోబీ పేరుతో, తాగడానికి మంచినీళ్ల పేరుతో, ముద్రించిన పుస్తకాలతో భారీ దోపిడీ, హాస్టల్ అనుమతి లేకపోయినా.. అక్రమ వసూళ్లు, డిపాజిట్ పేరుతో అక్రమ వసూళ్లు, ఇలా చెప్పుకుంటూ పోతే మాటల్లో చెప్పలేని రకరకాల ఫీజుల దోపిడీతో విద్యాహక్కు చట్ట నిబంధనలకే హడలు పుట్టించేలా ఎస్సార్ అంటేనే.. వామ్మో ఆ విద్యా సంస్థలా.. నిబంధనలు పాటించడమా.. **'నో'** సార్ అనేలా విద్యను వ్యాపారంగా మార్చేసి అక్రమ వసూళ్లే లక్ష్యంగా ముందుకెళ్తున్నారని విశ్వసనీయ సమాచారం.

ఈ విద్యా సంస్థకు సంబంధించి అనంతపురం నగర రూరల్ పరిధిలోనే ఓ నాలుగు చోట్ల.. అందులో ముఖ్యంగా గుత్తిరోడ్డు మార్కెట్‌యార్డ్ ఎదురుగా ఓ కళాశాల, టీవీ టవర్ సమీపాన ఏసీ క్యాంపస్ అంటూ మరో కళాశాల, ఈ రెండే కాకుండా రాచానపల్లి సమీపంలోని సీఆర్ఐటీలో మరో కళాశాలతో పాటు, బెంగళూరు హైవే మహేంద్ర షోరూం సమీపంలో ఓ పాఠశాల నిర్వహిస్తుందని తెలిసింది. ఈ ఎస్సార్‌కు సంబంధించిన మరింత సమాచారం తాజా తాజాగా **'అనంతసూర్య'** మరికొన్ని కథనాలతో వివరిస్తుందని తెలియజేస్తున్నాం.




# చిన్ననాటి స్నేహితులు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి చేయూత

**120 మంది విద్యార్థినులకు తరగతి గది ఫర్నిచర్ అందజేసిన డిస్కవర్ అనంతపురం, ఏజీఎస్ ఫౌండేషన్**

*నార్పల, జూలై 24 అనంత సూర్య :*

సమాజంలో ప్రతి పౌరుడు ప్రభుత్వ విద్యాభివృద్ధికి తనవంతు బాధ్యతను నిర్వర్తించాలనే సందేశాన్ని చాటుతూ చిన్ననాటి స్నేహితులు టి.ఎన్.కిషోర్, డిస్కవర్ అనంతపురం వ్యవస్థాపకుడు ఏజీ. అనిల్ కుమార్ కలిసి ఎంజేపీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ఫర్ గర్ల్స్, నార్పలలో చదువుతున్న 120 మంది విద్యార్థినులకు తరగతి గది ఫర్నిచర్‌ను అందజేశారు. పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్–టీచర్స్ సమావేశం సందర్భంగా ఏ.జి.అనిల్ కుమార్, ఏజీఎస్ ఫౌండేషన్ ప్రతినిధి ఏ.జి. ప్రమీలమ్మ ఈ ఫర్నిచర్‌ను పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. ఇప్పటివరకు నేలపై కూర్చొని చదువుకుంటున్న విద్యార్థినులు ఇకపై డెస్కులు, బెంచీలపై సౌకర్యవంతంగా విద్యాభ్యాసం కొనసాగించే అవకాశం లభించింది. ఈ సందర్భంగా విద్యార్థినులు కొత్త ఫర్నిచర్‌ను చూసి ఆనందం వ్యక్తం చేయగా, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది ఈ సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ దాతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏ.జి. అనిల్ కుమార్ మాట్లాడుతూ.. 140 కోట్ల జనాభా ఉన్న దేశంలో ప్రతి అవసరాన్ని ప్రభుత్వం ఒక్కటే తీర్చడం సాధ్యం కాదు.. మన పిల్లల భవిష్యత్తు కోసం ప్రతి పౌరుడు తనవంతు బాధ్యతగా ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలలకు సహకరించాలి.. ముఖ్యంగా బాలికల విద్యకు చేయూత అందించడం దేశ భవిష్యత్తును బలోపేతం చేసే అత్యంత గొప్ప సేవ అని అన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా డిస్కవర్ అనంతపురం, ఏజీఎస్ ఫౌండేషన్ ఈ పాఠశాల అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ కాలంలో పాఠశాలకు గ్రంథాలయం అభివృద్ధి, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, పాఠశాల ఫర్నిచర్, ల్యాప్‌టాప్‌ల పంపిణీ వంటి పలు కార్యక్రమాలను చేపట్టినట్లు వివరించారు. అంతేకాకుండా, పాఠశాలను 'పక్షుల నిలయం'గా తీర్చిదిద్దే లక్ష్యంతో వంద లాది కృత్రిమ గూళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రస్తుతం పాఠశాల ప్రాంగణంలో 400కు పైగా పిచ్చుకలు జన్మించి, ప్రకృతి–విద్య సమన్వయానికి ఈ పాఠశాల ఒక ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రజల భాగస్వామ్యం ఎంత ముఖ్యమో ఈ కార్యక్రమం మరోసారి చాటి చెప్పిందని నిర్వాహకులు తెలిపారు. ప్రతి చిన్నారి, ముఖ్యంగా ప్రతి బాలికకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు మరింత మంది దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు.

కార్యక్రమం ముగింపులో విద్యార్థినులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు టి.ఎన్.కిషోర్, డిస్కవర్ అనంతపురం, ఏజీఎస్ ఫౌండేషన్ చేసిన సేవలను అభినందిస్తూ, సమాజంలో స్నేహం, సేవాభావం, సామాజిక బాధ్యత కలిసివస్తే ప్రభుత్వ పాఠశాలల్లో కూడా గొప్ప మార్పులు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.




# కార్పొరేట్ సూల్స్‌ని తలపించేలా.. ప్రభుత్వ బడులు

- విద్యా వ్యవస్థలో మార్పులకు ఇదే నిదర్శనం
- ఎమ్మెల్యే దగ్గుపాటి
- శారదా మున్సిపల్ బాలకల ఉన్నత పాఠశాలలో మెగా పీటీఎం కార్యక్రమం
- విద్యార్థులు, తల్లిదండ్రులతో ఆటల పోటీలు, సహపంక్తి భోజనం
- విద్యా వ్యవస్థను జగన్ రెడ్డి భ్రష్టు పట్టించారన్న ఎమ్మెల్యే దగ్గుపాటి
- తల్లికి వందనంతో ప్రతి విద్యార్థి ఇంట ఆనందం కనిపిస్తోందన్న ఎమ్మెల్యే




**అనంతపురం, జూలై 24 అనంత సూర్య :** కార్పొరేట్ సూల్స్‌ని తలపించేలా ప్రభుత్వ బడులు కనిపిస్తున్నాయని.. విద్యా వ్యవస్థలో మార్పులకు ఇదే నిదర్శనమని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నగరంలోని శారదా మున్సిపల్ బాలకల ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పీటీఎం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ డిఇఓ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ జస్వంత్ రావులు ఎంఈవో, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పూజా కార్యక్రమాలు చేశారు. పాఠశాలను మొత్తం పరిశీలించారు. ఆ తర్వాత విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలలో విద్యాబోధన, సౌకర్యాలు, తల్లికి వందనం పథకాల గురించి ఎమ్మెల్యే దగ్గుపాటి ఆరా తీశారు. పాఠశాలల్లో సౌకర్యాలపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి ఆటల పోటీల్లో పాల్గొంటూ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఉత్సాహంగా కనిపించారు. విద్యార్థుల వైపు ఎమ్మెల్యే, ఇంకో వైపు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పోటాపోటీగా టగ్ ఆఫ్ వార్ అన్నారు. విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించారు. పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ పేరెంట్స్ మీటింగ్ అంటే కార్పొరేట్ బడుల్లోనే చూసేవారమని.. కానీ నేడుప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటివి నిర్వహిస్తున్నారన్నారు. గతంలో పిల్లల పుస్తకాలు, బెల్టులపై కూడా జగన్ బొమ్మలు కనిపించేవని.. ఉపాధ్యాయులను వైన్ షాపులు, బాత్ రూంల వద్ద ఉంచి.. విద్యా వ్యవస్థను జగన్ రెడ్డి భ్రష్టు పట్టించారన్నారు. అలాంటి శాఖను మంత్రి నారా లోకేష్ తీసుకుని ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. ఏ పాఠశాలలో చూసిన పండుగ వాతవారణం కనిపిస్తోందన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థల నుంచి ప్రభుత్వ బడుల్లో చేరుతున్నారన్నారు. ఇంట్లో ఎంత మంది ఉన్నా తల్లికి వందనం 15వేలు చొప్పున అందజేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్రంలో 67లక్షల మందికి పైగా విద్యార్థులకు రూ.10120కోట్లు అందజేశారన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలోని 49,489 విద్యార్థులకు 65కోట్ల రూపాయలు అందిందన్నారు. ఒకే ఇంట్లో నలుగురు పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం అందిందని.. ఈ రోజు ప్రతి విద్యార్థి ఇంటా పండుగ వాతావరణం కనిపిస్తోందన్నారు.

అనంతపురం అర్బన్ నియోజకవర్గ తరుపున సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, టిడిపి నాయకులు చరిత, దలవాయి రమాదేవి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పిఎల్ఎన్ మూర్తి, ఎంఈవోలు వెంకటస్వామి, సరితా రాణి, శివాలయం ఆలయం కమిటీ చైర్మన్ నరేంద్ర చౌదరి, పాఠశాల హెచ్ఎం సుష్మలత, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మీనాక్షి, త్రీ టౌన్ సిఐ కౌలుట్లయ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405